ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు

- మంత్రి జోగి రమేష్
- రామన్నపేటలో రూ.2.12 కోట్లతో అభివృద్ధి పనులు
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని రామన్నపేట గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు యావత్ భారత దేశంలో మరెక్కడా లేవన్నారు. ఇన్ని పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు.

రూ.2.12 కోట్ల అభివృద్ధి పనులు..

గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. మండలంలో మారుమూల గ్రామమైన రామన్నపేటలో రూ.2.12 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి జోగి రమేష్ వివరించారు. రూ.21.80 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం, రూ.42.80 లక్షలతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ భవనం, రూ.82.05 లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్లు, రూ.25.50 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.43 లక్షల వ్యయంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రామన్నపేట ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. త్వరలోనే రహదారి నిర్మాణ పనులు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. రామన్నపేట పీఏసీఎస్ చైర్మన్ మురాల వెంకటప్పయ్య పట్టుదలతో గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్నారని మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచి మురాల కవిత, ఎంపీటీసీ సభ్యురాలు మారుతి, ఆర్బీకే చైర్మన్ లుక్కా ఏలేసు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, తలుపుల వెంకట కృష్ణారావు, గరికపాటి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్


రామన్నపేటలో పథకాల బ్రోచర్ అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

జగన్ పాలనలో సామాజికాభివృద్ధి

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సామాజికాభివృద్ధి జరుగుతోందని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. పదో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్పొరేటర్ షేక్ ముంతాజ్ బేగం, డివిజన్ ఇన్‌చార్జి షేక్ బాషాతో కలిసి పేర్ని కిట్టు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, కుటుంబాల ఆర్థిక పరిస్థితి పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ ప్రాంతంలోని నిర్మల కాన్వెంట్ వెనుక వైపున 1985లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో పార్కు స్థలాన్ని అభివృద్ధి చేసి పార్కును ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేశారు. గృహాల మధ్యలో ఉన్న ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఖాళీస్థలాల వారికి నోటీసులు ఇచ్చి పిచ్చిమొక్కలను తొలగించాలని సచివాలయ సిబ్బందికి పేర్ని కిట్టు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, పురంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు రామిశెట్టి వాణిశ్రీ, గోపిశెట్టి సతీష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


పేర్ని కిట్టుకు సమస్యలు తెలుపుతున్న కాలనీవాసులు

క్లుప్తంగా

నేడు గృహాల నిర్మాణానికి శంకుస్థాపన

మచిలీపట్నంటౌన్: నగరంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు సోమవారం సామూహిక గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. నగరంలో సుమారు రెండు వేల మందికి పైగా లబ్ధిదారులకు కరగ్రహారంలో నివేశన స్థలాలు ఇచ్చారు. ఎ-బ్లాక్‌లో మెరక పనులు పూర్తయ్యాయి. దీంతో ఈ బ్లాక్‌లో స్థలాలు కేటాయించిన 2, 5, 6 డివిజన్లకు చెందిన లబ్ధిదారులతో శంకుస్థాపన చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దాదాపు 200 మంది లబ్ధిదారులు ఏకకాలంలో శంకుస్థాపనలు చేయనున్నారు. బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కమిషనర్ చంద్రయ్య, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొంటారు.

మార్చురీ బాక్స్ వితరణ

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ గ్రామానికి చెందిన మండలి బుల్లి బసవయ్య, ధనలక్ష్మీ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మార్చురీ బాక్స్‌ను స్పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి ఆదివారం అందజేశారు. గ్రామస్తులు ఉచితంగా వినియోగించుకునేందుకు మార్చురీ బాక్స్ అందించిన మండలి కుటుంబ సభ్యులకు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రావుకు సన్మానం



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావును చేనేత కార్మికులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఏపీ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కాగితపు అర్చన, వెంకటేశ్వరరావు దంపతులు, చేనేత కార్మికులు వెంకట్రావును దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. చేనేత కార్మికులు వెంకట శ్రీనివాస్, సొసైటీ చైర్‌పర్సన్ జె. అన్నపూర్ణయ్య, జలదీశ్వర సొసైటీ చైర్‌పర్సన్ తీరందాసు భావనారుషి, ఆకురాతి భాస్కరరావు, జంజనం రాంబాబు, పంచల కోటేశ్వరరావు, పంచల సత్యనారాయణ, గుత్తికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



కోనేరుసెంటర్: బందరు మండలం పెదకరగ్రహారం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు బొర్రా నటేష్, గుడిశేవ సత్యనారాయణ దంపతుల చేతుల మీదుగా విఘ్నేశ్వర పూజతో మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కలశపూజ, అఖండ దీపారాధన, స్వామి వారికి అభిషేకాలు, సహస్రనామ పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పెదకరగ్రహారం, క్యాంపుబెల్‌పేట, చిన కరగ్రహారం, పల్లెపాలెం, నవీన్‌మిట్టల్ కాలనీ తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మాఘ మాస పూజలు ప్రారంభం



పామర్రు: మాఘ మాసం ప్రారంభం ఆదివారం పాడ్యమిని పురస్కరించుకుని పలు వైష్ణవాలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. స్థానిక విష్ణాలయం, నిమ్మకూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పెరిశేపల్లి, పెదమద్దాలి,జమీగొల్వేపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధి రాపర్ల గ్రామంలో వేం చేసి ఉన్న గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలు, నవరసాలు, సుగంధ ద్రవ్యాలు, చందనం, పసుపు కుంకుమలతో విశేషంగా స్వామికి అభిషేకాలను చేశారు. అనంతరం స్వామికి శత సహస్త నామాలతో పలు రకాల పుష్పాలతో అలంకరించి పూజించారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకుడు బి.పద్మాకర్ ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ నిర్వాహకులు కాకర్ల బలరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో భక్తులు కె.శివయ్య, బి.బాలాకుమారి, బి.నవ్య, కె.శ్రీహరి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నడకుదురు(చల్లపల్లి): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నడకుదురులో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని సర్పంచ్ గొరిపర్తి సురేష్‌బాబు తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు వివరిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: డయల్ యువర్ డీఎం కార్యక్రమం సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీఎస్ఆర్టీసీ అవనిగడ్డ డిపోలో జరుగుతుందని డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలను సెల్: 99592 25466 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చల్లపల్లి: కృష్ణానది రేవులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. చల్లపల్లి మండలం నడకుదురు లంకలో ఆదివారం పేకాట జరుగుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ కుడిపూడి శ్రీనివాసుకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేశారు. పేకాట శిబిరాన్ని గుర్తించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,070లను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేలా వలంటీర్లు పనిచేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, పిట్టల్లంక సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహ సారథులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వలంటీర్లు తమ విధులు సక్రమంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రతి రోజూ తమ క్లస్టర్ పరిధిలోని ఇళ్లకు వలంటీర్లు వెళ్లి ఆయా కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకుని, వాటిని సచివాలయ సిబ్బంది తెలియజేయాలని రమేష్‌బాబు సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను తప్పనిసరిగా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిలో ఏ లోటు లేకుండా గ్రామ స్థాయిలో ఉద్యోగులు చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు, గృహ నిర్మాణాలు, వీధి దీపాల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పార్టీ బలోపేతానికి పని చేయాలి..

పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా నియమించిన గృహ సారథులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే రమేష్‌బాబు పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లను సమన్వయం చేస్తూ గృహ సారథులు తమకు కేటాయించిన గృహాలకు వెళ్లి పథకాలను వివరించాలన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని రమేష్‌బాబు కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ యువనేత సింహాద్రి వికాస్, జెడ్పీటీసీ సత్యనారాయణ, పార్టీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి నారాయణరావు, సర్పంచులు కొప్పనాతి శేషుబాబు, యలవర్తి నాంచారయ్య, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఉప సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ, కడవకొల్లు శ్రీనివాసరావు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కృష్ణమోహన్ మృతికి సంతాపం

రాముడుపాలెం (చల్లపల్లి): నడకుదురు శివారు రాముడుపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మాతంగి కృష్ణమోహన్ (45) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్ రాముడుపాలెంలో కృష్ణమోహన్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారి ఇద్దరు కుమార్తెల తదుపరి విద్యాభ్యాసం ఖర్చులు భరిస్తామని భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచ్ మాతంగి వేణు, వైఎస్సార్ సీపీ నాయకులు కైలా దాసు, పెరికే నాగరాజు, పఠాన్ కరిముల్లా ఖాన్, అబ్బూరి నాంచారయ్య, మోపిదేవి పూర్ణ, అల్లంశెట్టి వెంకటాచలం, రాజులపాటి భద్రి, మెండు వీరబాబు నివాళులర్పించారు.


ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీటీసీ కల్యాణి

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ హెచ్ఓడీ డాక్టర్ అమరేంద్రకుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్‌శర్మ, మూర్తి స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా జేడీ డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ మనోజ్, మోపిదేవి, పురిటిగడ్డ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మోపిదేవిలో వెటర్నరీ వైద్యశాలను సందర్శించారు. ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.


స్వామివారి చిత్రపటం అందుకుంటున్న అమరేంద్రకుమార్ దంపతులు

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



జమీదగ్గుమిల్లి(పామర్రు): జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని జమీదగ్గుమిల్లి హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ రాజన్ అన్నారు. మండల పరిధి జమీదగ్గుమిల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఈనెల 20న ముస్తాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారన్నారు. అండర్ -17 లో మెరుగు నరేంద్ర, అండర్-14లో మెరుగు భవ్యశ్రీ, కూనపరెడ్డి సుష్మ మైత్రేయిని, కూన శివ నందిని ఎంపిక అయ్యారని తెలిపారు. వీరు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారన్నారు. మెరుగు దివ్య, కూనపరెడ్డి సుష్మ మైత్రేయినిలు 3 కిలోమీటర్ల నడక విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ బాదర్ల రామును హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష


పెడన వాసవీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బారులు తీరిన అభ్యర్థులు

పెడన: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోలీస్ రాత పరీక్షకు పెడన వాసవి ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 811 మంది హాజరయ్యారు. ఆదివారం ఉదయం పది గంటలకు పరీక్ష రాయాల్సి ఉండగా అభ్యర్థులు ఉదయం ఏడు గంటల నుంచే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.

అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం లోపలికి పంపించారు. మొత్తం 922 మంది అభ్యర్థులకు గాను 811 మంది పరీక్ష రాశారని కేంద్రం అధికారి ఎస్‌వీసీ గుప్తా తెలిపారు. వీరిలో 651 మంది పురుషులు, 160 మంది మహిళా అభ్యర్థులున్నారని చెప్పారు. మచిలీపట్నం దిశ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్, పోలీస్ సిబ్బంది పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వనవలమ్మ జాతర


అమ్మవారిని దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

మచిలీపట్నంటౌన్: నిజాంపేటలోని సూతి వీరయ్య గారి ఆది వనవలమ్మ దేవి జాతర మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి పోటెత్తారు. బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని జమ్మి చెట్టు వద్ద, అమ్మవారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకుని పూజలు చేశారు.

క్లబ్ సేవలను విస్తృత పర్చాలి

పామర్రు: క్లబ్‌ల ద్వారా మరింత మెరుగైన సేవలను అందజేస్తూ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వాసవీ అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బొగ్గరపు జాలయ్య సుబ్బరత్తమ్మ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్‌ల ద్వారా 25 రకాల సేవలను నిరంతరం అందిస్తున్నామన్నారు. ఆరోగ్యమస్తు, ఆలయాల్లో తాగు నీటి ప్లాంట్ల ఏర్పాటు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ, క్లబ్ సేవలపై అవగాహన శిబిరాలను నిర్వహించడం, అమ్మ ఆత్మగౌరవ కేంద్రాల ఏర్పాటు, అనాథలైన వృద్ధులకు పెన్షన్‌ల పంపిణీ చేయటం తదితర సేవలను క్లబ్‌ల ద్వారా అందజేయాలని పిలుపు నిచ్చారు. తదుపరి నూతనంగా ఎంపికైన వాసవీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులైన చిన్నం ఆదినారాయణరావు, పూటుకూరి పిచ్చేశ్వరరావు, కంచర్ల వీరజనార్దనరావు, నూతనంగా ఎంపికైన వాసవీ వనిత క్లబ్ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులైన చిన్నం పద్మనాగ లక్ష్మీకుమారి, పూటుకూరి లత, కంచర్ల ఉషారాణిల చేత ప్రమాణం చేయించారు. అనంతరం నిరుపేదలైన వారికి నెలకు రూ.200ల చొప్పున దాతల సహకారంతో పెన్షన్‌లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మండా కమలాకరనాథ్, ఎం.వెంకటలక్ష్మి, జిల్లా గవర్నర్ మాజేటి రామచంద్రరావు, జిల్లా కార్యదర్శి ఆలపాటి ప్రభాకరరావు, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, జిల్లా వైస్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పరిశ వెంకట నాంచారయ్య, సభ్యులు కొత్త శివమోహన పుల్లారావు, బొగ్గరపు జాలయ్య, జి.భరతుడు, జి.సాయిరాం, త్రినాథ్‌రావు, తాళ్లూరి నరేష్, టి.వెంకట కృష్ణారావు, సనిశెట్టి లక్ష్మీజానకి, సురేష్ పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శ్రీనివాసరావు

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

గుడివాడటౌన్: ద్విచక్ర వాహనం నడిపే వారిలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన వారంతా హెల్మెట్ లేని వారేనని డీఎస్పీ ఎస్ సత్యానందం అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సీతాపతిరావు, గుడివాడ తహసీల్దార్ ఆంజనేయులుతో కలసి ఆయన హెల్మెట్ అవగాహనా ర్యాలీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ఉండి ప్రాణాపాయ ప్రమాదాల్లో సైతం బయటపడిన అనేక కేసులు తాము గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అత్యంత తేలికపాటి మన్నిక కల్గిన హెల్మెట్‌లు అందుబాటులో వస్తున్నందున ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణానికి భద్రత కల్పించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్టీఓ విజయసారథి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం లక్ష్మీ నరసింహపురం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గుడివాడకు చెందిన ఆర్కే హాస్పిటల్స్ సౌజన్యంతో సాయి వరలక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో ఎముకలు, గుండె, నరాలు తదితర వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు.

ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో ఆర్ఎంపీ వైద్యుడు శ్యామ్ సుందర్‌రాజు ఈ శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పి.ప్రశాంత్, శశాంక్, పవన్ సాయి, పీఆర్వో ఓ.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగూర్‌బాబు, ఎన్.కుటుంబరావు, టి.వెంకటేశ్వరరావు, హనుమంతు, శ్రీను పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే వాహనాలు సీజ్

ఎస్ఐ రాజేంద్రప్రసాద్



కోడూరు: ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటోవాలాలకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. వాహనాల్లో పరిమితికి మించిన ప్రయాణికులను చేరవేస్తున్నారని, దీని వల్ల ప్రాణాలకే ప్రమాదమని ఎస్ఐ అన్నారు. నిబంధనల మేరకు ప్రయాణికులను తరలించాలని, ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు బ్యాడ్జీలను ధరించాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, ఆర్సీ కలిగి ఉండి హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సూచించారు. ఏఎస్ఐ వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.